













సమ్మర్‌లో ఎంచక్కా

సెలవుల్లో సమ్మర్ క్యాంపులు సందడిగా మారాయి. తల్లిదండ్రులు పిల్లల అభిరుచికి తగ్గట్టుగా వారికి నచ్చిన కోర్సుల్లో చేర్పిస్తుండడంతో శిక్షణ శిబిరాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. సిద్దిపేటలోని దీకొండ మైసమ్మ ఆలయంలో ఉచిత కరాటే శిక్షణ క్యాంపులో బాలబాలికలు స్వయం రక్షణ మెలకువలను నేర్చుకుంటున్నారు. సిద్దిపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలోని స్విమ్మింగ్‌పూల్‌లో సాయంకాలం రెండు గంటల పాటు నేర్పిస్తున్న ఈతలో చిన్నారులు తర్ఫీదు పొందుతున్నారు. అలాగే నామమాత్రపు ఫీజుతో నిర్వహిస్తున్న శ్రీనగర్‌కాలనీలోని భవానీ క్లాసికల్ డ్యాన్స్ అకాడమీ అమ్మాయిలతో కళకళలాడుతున్నది.

- జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మే 18 (ఆంధ్రజ్యోతి)



సిద్దిపేటలో హెల్మెట్ ధరించకుండా వెళ్తున్న ద్విచక్రవాహనదారులు

తలకెక్కించుకో..!

హెల్మెట్ ఓ రక్షణ కవచం.. లేకుంటే అంతే!!

రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారులు బలి

తలకు తీవ్ర గాయాలతో 70 శాతం మరణాలు

సిద్దిపేట క్రైం, మే 18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఎంతో మంది ప్రాణాలు గాల్లో కలుస్తుండగా.. ఎంతోమంది తీవ్రగాయాల పాలవుతున్నారు. మృతిచెందుతున్న వారిలో ఎక్కువగా ద్విచక్ర వాహనదారులే. తలకు గాయమై సంఘటన స్థలంలోనే చనిపోతున్నవారు కొందరైతే.. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణిస్తున్న వారు మరికొందరు. తీవ్ర గాయాలతో నరకం చూస్తున్న వారు ఇంకొందరు. దీనికి కారణం ద్విచక్ర వాహనదారులు తలకు హెల్మెట్ ధరించకపోవడమే. హెల్మెట్ ధరించిన వాహనదారులు రోడ్డు ప్రమాదాల్లో ఎంతోమంది ప్రాణాలను దక్కించుకున్నారు.

52 బైక్ యాక్సిడెంట్లు.. 33 మంది మృతి

సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో జనవరి నుంచి మే వరకు 185 రోడ్డు ప్రమాదాలు జరగగా 88 మంది మృతి చెందారు. 200 మంది గాయాల పాలయ్యారు. వీటిలో మోటర్ సైకిల్ ద్వారా 52 రోడ్డు ప్రమాదాలు జరగగా 33 మంది మృతిచెందగా 48 మందికి గాయాలయ్యాయి. బైక్ యాక్సిడెంట్లలో ఎక్కువగా ప్రాణాలు కోల్పోయారు. వీరిలో తలకు తీవ్ర గాయాలు కావడంతోనే 70 శాతం మంది మృతి చెందారు. కొంతమంది హెల్మెట్ ధరించడంతో మేజర్ రోడ్డు ప్రమాదం జరిగినా కాళ్లు, చేతులకు గాయాలై ప్రాణాలతో బయటపడిన వారు ఉన్నారు.

బాధ్యతతో ధరించాలి

వాహనదారులు హెల్మెట్ బరువుగా కాకుండా బాధ్యతగా పెట్టుకోవాలి. హెల్మెట్ లేకుంటే పోలీసులు జరిమానా విధిస్తారని భయంతో కాకుండా, ప్రాణాలకు రక్షణ కవచంగా ఉపయోగపడుతుందని మరిచిపోవద్దు. బైక్‌పై ఇద్దరు వ్యక్తులు ప్రయాణించినప్పుడు ఇద్దరు హెల్మెట్లు పెట్టుకుంటే మరీ మంచిది. హెల్మెట్ వాడకంతో దుమ్ముధూళి నుంచి కూడా రక్షణ పొందవచ్చు. తల్లిదండ్రులు, ఇంట్లో పెద్దవారు తమ పిల్లలకు, ముఖ్యంగా యువతకు హెల్మెట్ ధరించాకే బయటకు పంపించాలి. పోలీసుల ఉదాసీనత కూడా ద్విచక్రవాహనదారుల నిర్లక్ష్యానికి కారణమవుతోంది. బైక్ ఆర్‌సీ, లైసెన్స్ లేకుంటే జరిమానా విధిస్తుండగా, హెల్మెట్ ధరించకుంటే చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తే ద్విచక్రవాహనదారులు మారే అవకాశం ఉంటుంది.

పచ్చిరొట్ట విత్తనాలేవి?

జిల్లాలో ఇంతవరకు సరఫరా కానీ జీలుగు, జనుము



జీలుగును దున్నుతున్న రైతు (ఫైల్)

సిద్దిపేట కలెక్టరేట్, మే 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు ఇప్పటివరకు ఒక్క బస్తా పచ్చిరొట్ట విత్తనాలు రాలేవు. వానాకాలం పంటల సీజన్‌కు 40 రోజుల ముందు రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అవసరపడతాయి. ఇంకా పక్షం రోజుల్లో వానాకాలం సీజన్ ప్రారంభం కాబోతుండగా ఇంతవరకు విత్తనాలు రాలేదు. వరి పంట సాగు చేసే రైతులు పచ్చిరొట్ట సాగు చేసి, అధిక దిగుబడులు పొందాలని వ్యవసాయాధికారులే సూచిస్తుండగా ఆచరణలో మాత్రం ఆ శాఖ అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది జిల్లాకు 5,500 క్వింటాళ్ల జీలుగు, 800 క్వింటాళ్ల జనుము అవసరం పడనున్నట్లు ప్రతిపాదనలు పంపించారు. వీటిని రైతులకు 50 శాతం సబ్సిడీతో అందజేయాలి. 30 కేజీల జీలుగు బస్తాను రూ.1116, 40 కేజీల జనుము బస్తాను రూ.1448కి అందించనున్నారు. కానీ, జిల్లాలో ఎక్కడ సరఫరా కాలేదు. గతేడాది కూడా ఇలానే ఆలస్యంగా జిల్లాకు చేరుకున్నాయి. అది కూడా అరకొరగానే వచ్చాయి. గతానుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాదైనా సక్రమంగా సరఫరా చేయాల్సి ఉండగా విఫలమైంది.

త్వరగా పంపిణీ చేయాలి



ఆగ్రోస్ కేంద్రాల్లో అధికారులను ఎప్పుడు అడిగినా జీలుగ విత్తనాలు రెండు రోజుల్లో వస్తుందంటూ చెబుతున్నారు. కానీ ఇప్పటివరకు రాలేదు. జీలుగు విత్తనాలు ఆలస్యంగా చల్లితే వరి సాగు కూడా ఆలస్యమవుతుంది. త్వరగా అందుబాటులోకి తీసుకొచ్చి పంపిణీ చేయాలి.

- శ్రీవర్ధన్, కమలాయపల్లి

వేసవి సెలవులు వచ్చాయంటే చాలు పట్టణాలే కాదు పల్లెల్లోనూ ప్రైవేటు స్కూల్ సిబ్బంది ప్రత్యక్షమయ్యే వారు. పిల్లలను తమ స్కూల్‌లో చేర్పించాలని తల్లిదండ్రుల వెంట పడేవారు. ఇలాంటివి చాలానే చూశాం. కానీ, తాజాగా జిల్లాలో ప్రభుత్వ బడుల ఉపాధ్యాయులు సైతం గ్రామాల బాట పట్టారు. ఉపాధ్యాయులే కాదు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు సైతం పిల్లలను సర్కారు పాఠశాలల్లో చేర్పించాలని కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్ల తరహాలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. సాధారణంగా బడులు ప్రారంభమయ్యే జూన్‌లో ప్రభుత్వ పాఠశాలలు బడి బాట ద్వారా ఇంటింటి ప్రచారం చేస్తుంటాయి. ఈసారి ఇప్పటి నుంచే ఉపాధ్యాయ బృందం స్వచ్ఛందంగా బడి బాట నిర్వహిస్తుండడం గమనార్హం.



చిన్నకోదూరు మండలం రామంచలో ఉపాధి హామీ పని ప్రదేశానికి వెళ్లి ప్రచారం నిర్వహించిన ఉపాధ్యాయులు

రారండోయ్.. సర్కార్ బడికి

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల పెంపునకు కసరత్తు

జిల్లాలో పలుచోట్ల ముందస్తు బడి బాట

స్వచ్ఛందంగా చేపడుతున్న ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు

ఇంటింటికీ వెళ్లి ప్రచారం... తల్లిదండ్రులకు అవగాహన

చిన్నకోదూరు/దౌల్తాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి) : చిన్నకోదూరు మండలం రామంచ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బృందం శుక్రవారం గ్రామంలో బడి బాట నిర్వహించారు. అయితే, ఉదయం వేళ ఉపాధి హామీ పనులు చేసేందుకు గ్రామస్థులు చాలా మంది వెళ్లగా, ఉపాధ్యాయులు అక్కడికే వెళ్లి ప్రచారం చేశారు. మిరుదొడ్డి ఎంఈవో ప్రవీణ్ బాబు కూడా రెండు రోజుల క్రితం ఉపాధ్యాయులతో కలిసి మండలంలోని అందె, మల్లుపల్లి గ్రామాల్లో ముందస్తు బడి బాట నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ బడుల్లో విద్యార్థులను చేర్పాలని పెద్దలను కోరారు. ఇలా జిల్లాలో వీరే కాదు, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం స్వచ్ఛందంగా ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అమ్మ ఆదర్శ కమిటీలతో కలిసి గ్రామాలకు వెళ్లి ఇంటింటా ప్రచారం చేపట్టారు.

క్షేత్రస్థాయిలో ప్రచారం..

ప్రభుత్వ పాఠశాలల ద్వారా ఉండే ప్రయోజనాలను ఉపాధ్యాయులు క్షేత్రస్థాయికి వెళ్లి ప్రచారం చేస్తున్నారు. ఇటీవల పదో తరగతి ఫలితాలు సాధించిన మెరుగైన ఫలితాలను చెబుతున్నారు. పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలు, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌ల పంపిణీ, యూనిఫాంల అందజేత, మధ్యాహ్న భోజన సౌకర్యం అనేక రకాల అంశాలను ఇంటింటికీ వెళ్తూ తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. మీ పిల్లలను మా పాఠశాలల్లో చేర్పించండి బాధ్యతగా చూసుకుంటాం, నాణ్యమైన విద్యనందిస్తామని హామీ ఇస్తున్నారు. ఏఐ ద్వారా విద్యా బోధన, విశాలమైన తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యం, సురక్షితమైన తాగునీరు, ఆహ్లాదకరమైన చెట్లు, విశాలమైన ఆటస్థలం, ప్రతీ తరగతికి సుశిక్షితులైన ఉపాధ్యాయులతో ఇంగ్లిష్ బోధన, ప్రతీ నెల తల్లిదండ్రుల సమావేశం ఇలా పలు అంశాలను ప్రచారం చేస్తూ గ్రామాలల్లో వాడవాడల తిరుగుతున్నారు. ఈ ముందస్తు ప్రచారం సత్ఫలితాలను ఇచ్చే అవకాశం ఉన్నదని ఉపాధ్యాయులు భావిస్తున్నారు.

విద్యార్థుల సంఖ్యను పెంచడమే లక్ష్యం



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, మధ్యాహ్న భోజనం,యూనిఫాం తదితర విషయాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లి ప్రవేశాలు పెంచేలా ప్రయత్నాం చేస్తున్నారు.

- గజ్జెల కనకరాజు, ఎంఈవో, దౌల్తాబాద్ మండలం

విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచించాలి



పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపి ఆర్థికంగా నష్టపోకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులు ఆలోచించాలి. సర్కారు బడుల్లో అన్ని వసతులతో కూడిన విద్య అందుతుంది. ముందస్తు బడిబాట కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.

- బాసిత్, హెచ్‌ఎం, దొమ్మాట జడ్పీ పాఠశాల

కానిస్టేబుల్ కిష్టయ్య

కుటుంబానికి కేసీఆర్ భరోసా

- కూతురు వైద్య విద్య కోసం మరోసారి ఆర్థిక సాయం అందజేత



కేసీఆర్‌తో తెలంగాణ అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబ సభ్యులు

మర్కుక్, మే 18 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని ఆయన నివాసంలో తెలంగాణ అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబసభ్యులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటంలో తన ప్రాణాలను బలిదానం చేసిన కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబానికి అన్నీ తానై కేసీఆర్ ఆదుకుంటున్న విషయం తెలిసిందే. కిష్టయ్య కుమార్తె ప్రియాంక వైద్యవిద్య చదువుకు కేసీఆర్ ఐదు సంవత్సరాలుగా ఆర్థిక సాయం అందిస్తూనే ఉన్నారు. వైద్య విద్యలో ఆసక్తి కనబరిచిన ప్రియాంక ఇప్పటికే ఎంబీబీఎస్ పూర్తి చేశారు. పీజీ చేస్తున్న ప్రియాంక చదువుకు కావాల్సిన ఆర్థిక సాయాన్ని కూడా ఆదివారం కేసీఆర్ కిష్టయ్య భార్యాపిల్లలకు అందించారు. కిష్టయ్య కుమారుడు రాహుల్ వివాహం నిశ్చయమైన విషయాన్ని తెలుసుకున్న కేసీఆర్ సంతోషం వ్యక్తం చేస్తూ రాహుల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కిష్టయ్య కుటుంబానికి తన సంపూర్ణ సహకారం ఎప్పటికీ కొనసాగుతూనే ఉంటుందని కేసీఆర్ భరోసా ఇచ్చారు.

ఎన్ఎంఆర్ కార్మికులకు.. ఉద్వాసన తప్పదా..!

జిల్లాలో 1000 మంది కార్మికులు

ఇప్పటికే 600 మంది తొలగింపు

ప్రత్యేక పాలన వ్యవస్థ వచ్చినప్పటి నుంచి అందని జీతాలు

న్యాయం చేయాలని కార్మిక సంఘాల డిమాండ్

8

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ చోరీ

తీగలకుంటపల్లిలో ఘటన

7

రంగనాయకసాగర్ గెస్ట్‌హౌస్‌కు

విచ్చేసిన హైకోర్ట్ న్యాయమూర్తి



న్యాయమూర్తికి కలెక్టర్ అందజేస్తున్న పెయింటింగ్

చిన్నకోదూరు, మే 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ రిజర్వాయర్ గెస్ట్‌హౌస్‌కు ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి పి.సుధా విచ్చేశారు. శనివారం సరస్వతీ నది పుష్కరాలకు కాళేశ్వరం వెళ్లిన న్యాయమూర్తి తిరుగు ప్రయాణంలో ఇక్కడి గెస్ట్‌హౌస్‌కు వచ్చారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి పోలీసులు గౌరవ వందనాన్ని స్వీకరించారు. కలెక్టర్ మనుచౌదరి, జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయిరమాదేవి న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను సన్మానించి, చేర్యాల నకాశీ పెయింటింగ్‌ను బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా వారు జిల్లాలో న్యాయ విషయాల గూర్చి కాసేపు చర్చించారు. న్యాయమూర్తి ఆహ్లాదకరమైన జలాశయ వాతావారణాన్ని ఆస్వాదిస్తూ మధ్యాహ్నం భోజనం చేసి, కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఆమెను కలిసిన వారిలో ఆర్డీవో సదానందం, సిద్దిపేట ఏసీపీ మధు, న్యాయ, రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు ఉన్నారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తజనం

● పలు గ్రామాల్లో వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనలు..
● ఘనంగా బోనాల సమర్పణ

ఉమ్మడి జిల్లాలోని ప్రముఖ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.. ఆదివారం అందులోనూ వేసవి సెలవులు కావడంతో పిల్లాపాపలతో ఆలయాలకు తరలివచ్చారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేశారు.


వర్గల్ నాచగిరి క్షేత్రంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


పెద్దశంకరంపేట మండలం కొప్పోల్ ఉమా సంగమేశ్వరస్వామి ఆలయంలో సత్యనారాయణ వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

వర్గల్/జగదేవ్‌పూర్/చేర్యాల/పాపన్నపేట/హుస్నాబాద్/సిద్దిపేటకల్చరల్/గుమ్మడిదల/పెద్దశంకరంపేట/చిన్నశంకరంపేట, మే18: వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామ వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని తీగుల్ నర్సాపూర్ గ్రామ సమీపంలోని కొండపోచమ్మ దేవాలయంలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది.

● కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ సందర్శనార్థం ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయపరిసరాలు భక్తజనసందోహంగా మారాయి. ఈసందర్భంగా తలనీలాలు సమర్పించి కోనేరులో పుణ్యస్నాన మాచరించారు. భక్తిప్రపత్తులతో బోనం నివేదించి చెలక, నజరు, ముఖమండప పట్నాలు రచించారు. స్వామివారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, బండారి, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి దర్శనంకోసం సుమారు 2గంటల సమయం పట్టింది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో అన్నపూ ర్ణ, ఆలయ ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు సురేందర్‌రెడ్డి, శ్రీరాములు తదితరులు పర్యవేక్షించారు.

● కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నం నుంచి కొండపోచమ్మ దేవాలయానికి విచ్చేశారు. రంగులతో అలంకరించిన బోనాలను నెత్తిపై ఎత్తుకొని శివసత్తుల శిగాలు డప్పు చప్పుల్లతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి ఒడి బియ్యం పోశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా అన్ని సౌకర్యాలు కల్పించామని ఆలయ ఈవో మోహన్‌రె డ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కనకయ్య, హరిబాబు తదితరులు ఉన్నారు.

● ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. తెల్లవారుజామున 5.30 గంటలకు అర్చకులు అమ్మవారికి అభిషేకం చేపట్టి సహస్రనామార్చన, కుంకుమార్చన అనంతరం దర్శనం కల్పించారు. మంజీరా నదీపాయల్లో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు మాతను దర్శించుకున్నారు. బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బాలికను కాపాడిన పోలీసులు

వనదుర్గామాత ఆలయ సమీపంలోని చెక్‌డ్యాంలో ప్రమాదవశాత్తూ నీటిలో జారిపడిన ఓ బాలికను క్యూఆర్టీ పోలీసులు రక్షించినట్లు జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ సమీపంలో కామారెడ్డి జిల్లా చింతపల్లికి చెందిన మరో బాలుడు లలిత్ గౌడ్ ఆలయ పరిసరాల్లో తప్పిపోయి తిరుగుతుండగా గమనించిన క్యూఆర్టీ పోలీసులు బాలుడి వివరాలు తెలుసుకొని ఆలయం వద్ద వారి తల్లిదండ్రులకు అప్పగించారు .ఈ సందర్భంగా ఏఆర్ఎస్ఐ శ్రీనివాస్, కానిస్టేబుళ్లు యాదగిరి, రాజేందర్‌ను ఆయన అభినందించారు.

● హుస్నాబాద్‌లోని రేణుకా ఎల్లమ్మ దేవి జాతరకు భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకునేదుకు గంటల పాటు క్యూలో నిల్చున్నారు. ఒడి బియ్యం, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రేణుకా ఎల్లమ్మ జాతర మరో 24 రోజులు ఉండటంతో దినదినం భక్తుల రద్దీ పెరుగుతుంది. ఆదివారం రాత్రి ఆలయ ప్రాంగణంలో మల్యాల కృష్ణ ఒగ్గు డోలు బృందం ప్రదర్శన నిర్వహించారు. ఈ బృంద ప్రదర్శన జాతరకు వచ్చిన భక్తులను అలరించింది. ఇందులో ఉత్సవ కమిటీ సభ్యులు పచ్చిమట్ల రాధ, పూదరి శ్రీనివాస్‌గౌడ్, పచ్చిమట్ల శ్రీకాంత్, రమాదేవి, గాజుల భగవాన్, వీర రాజు, బెక్కంటి రాజయ్య, పరమేశ్వర్ తదితరులున్నారు.

● సిద్దిపేట జిల్లా కేంద్రంలోని నీలకంఠనగర్‌లోని శ్రీగౌరి సహిత నీలకంఠేశ్వర స్వామి ఆలయ 34వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం స్వామి వారికి రథోత్సవం నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేకంగా చేయించిన రథంలో పట్టణ పుర వీదుల గూండా స్వామి వారిని ఊరేగించారు. సిద్దిపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ స్వర్ణోత్సవాల్లో భాగంగా ఆదివారం వైనతేయ ఇష్టి, హోమాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ధ్వజారోహణం జరిగింది. స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని త్రిదండి దేవనాథ్ చినజీయర్ స్వామి వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు.

● గుమ్మడిదల మండల పరిధిలోని కొత్తపల్లిలో శ్రీ భ్రమరాంబిక మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవ కార్యక్రమాలు కొనసాగాయి. పురోహితులు ఆంజనేయ శర్మ మంత్రోచ్ఛరణ నడుమ మధ్య గుడి దాతలు బొంతపల్లి మాజీ సర్పంచ్ ఆలేటి నవీన శ్రీనివాస్‌రెడ్డి, ఆలేటి జగన్మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్దన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, లలితా నరసింహారెడ్డి, ఆంజనేయులు, రాజశేఖర్, వేణు, దేవేందర్ రెడ్డి, మల్లేష్ గౌడ్, మంగయ్య, సదానందరెడ్డి, గోపాల్, సత్తయ్య, చక్రపాణి, నగేష్‌గౌడ్, వినోద్‌గౌడ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

● పెద్దశంకరంపేట మండల పరిధిలోని కొప్పోల్ ఉమా సంగమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. 108 జంటలు వ్రతాల్లో పాల్గొన్నాయి. భక్తులందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు పద్మబాపిరాజు, కొత్తపల్లి రాజులు, సీతారామారావు, సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. మండల పరిధిలోని మక్తలక్ష్మాపూర్‌లో మాణిక్ ప్రభు మహారాజ్ జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారికి అంగరంగ వైభవంగా బోనాలను సమర్పించారు. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు, యువకులు గ్రామస్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

● చిన్నశంకరంపేట మండలం అంబాజీపేటలో గౌడ సంఘం ఆధ్వర్యంలోని రేణుకా ఎల్లమ్మ ప్రతిష్ఠాపనలు రెండోరోజు కొనసాగాయి. ఆదివారం పండితులు యంత్ర పూజలు నిర్వహించి విగ్రహాలను ప్రతిష్ఠించారు. పూర్ణాహుతి, పట్నం పూజ, బండారు కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. చిన్నశంకరంపేట మండలం సూరారంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పెద్దిరాజు పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఆఖరిరోజు అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు.

● చేర్యాల మండలం దానంపల్లి గ్రామంలో బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా మహంకాళి, పోచమ్మ దేవతకు భక్తిప్రపత్తులతో బోనాలు నివేదించారు. డప్పుచప్పుళ్ల దరువు, శివసత్తుల సిగాల నడుమ మహిళలు ఊరేగింపుగా ఆయా ఆలయాలకు చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తమ పాడి పంటలు చల్లగా ఉండాలని వేడుకున్నారు. బోనాల పండుగ నేపథ్యంలో గ్రామంలో సందడి నెలకొన్నది.

అమర్‌నాథ్‌లో భక్తులకు సిద్దిపేట అన్నప్రసాదం

సిద్దిపేట ఆధ్యాత్మిక, ధార్మిక, సామాజిక సేవలకు నెలవుగా మారిందని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఇటీవలే కేదార్‌నాథ్‌లో అన్నదానం కార్యక్రమం నిర్వహించి జూలై 3 నుంచి అమర్‌నాథ్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో అమర్‌నాథ్ సేవా సమితి వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న అన్నప్రసాద కార్యక్రమ కరపత్రాన్ని హరీశ్‌రావు ఆవిష్కరించారు. తన సంపూర్ణ సహకారం అందిస్తానని చెప్పారు.


ఏడుపాయలలో దుర్గామాతను దర్శించుకుంటున్న భక్తులు


హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ జాతరలో ఒగ్గు డోలు బృంద ప్రదర్శన


సిద్దిపేటలో శ్రీగౌరి సహిత నీలకంఠేశ్వర స్వామి రథోత్సవం

ప్రజలందరినీ ఏకం చేసే తిరంగా యాత్ర

● బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్

మెదక్ అర్బన్, మే 18(ఆంధ్రజ్యోతి): దేశరక్షణకు ప్రతిఒక్కరం సైనికులం అవుతామని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు మల్లేశం గౌడ్ అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. ఉగ్రవాదుల దాడి తర్వాత దేశ ప్రజలందరూ ఒక్కటై సైనికుల వెంట నిలవడం గర్వంగా ఉందన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ... ప్రజల ప్రాణాలను తీయాలని చూస్తున్న పాకిస్థాన్‌కు మన సైనికులు తగిన గుణపాఠం చెప్పారన్నారు. మంగళవారం మెదక్ పట్టణంలో తిరంగా యాత్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ రఘునందన్‌రావు హాజరు కానున్నట్లు తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా, కుల సంఘాలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో భార్య, కూతురుపై దాడి

● కూతురు పరిస్థితి విషమం

శివ్వంపేట , మే 18 (ఆంధ్రజ్యోతి): మద్యంమత్తులో విచక్షణ కోల్పోయిన భర్త భార్యపై దాడికి పాల్పడ్డాడు. అడ్డుకోబోయిన కూతురుపై కూడా దాడి చేశాడు. ఈ సంఘటన ఆదివారం మగ్దంపూర్‌లో చోటుచేసుకుంది. సోము రమేష్ అతిగా మద్యం సేవించి వచ్చి భార్యను కొట్టాడు. గమనించిన కూతురు హేమలత అతన్ని అడ్డుకోబోయింది. కోపానికి గురైన రమేష్ ఆమె ఛాతి మీద తన్ని గొంతు నులిమాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు అడ్డుకుని పాపను 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.


కక్కర్‌వాడ గ్రామంలో కర్రలపై విద్యుత్ వైర్లను ఏర్పాటు చేసిన రైతు


ఝరాసంగంలో ఓ పొలంలో చెట్టుపై వంగిన విద్యుత్ స్తంభం

పొంచి ఉన్న ప్రమాదం

● చేతికందే ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగలు

ఝరాసంగం, మే18 (ఆంధ్రజ్యోతి) ఝరాసంగంతో పాటు మండల పరిధిలోని కుప్పానగర్, కక్కర్‌వాడ, ఏల్గోయి, పోట్‌పల్లి, మాచూనూర్, బిడెకన్నె, తదితర గ్రామాల్లో పొలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు వంగిపోయి ప్రమాదకరంగా మారాయి. కొన్నిచోట్ల చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు ఉండడంతో రైతులు రాత్రివేళల్లో పొలాలకు వెళ్లాలంటే భయపడుతున్నారు. వేలాడుతున్న తీగలను సరిచేయాలని అధికారులకు ఎన్నోసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. తక్కువ ఎత్తులో వేలాడుతున్న తీగలు సాగు పనులకు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్‌కు ట్రాక్టర్ సహాయంతో దుక్కులు చేద్దామంటే వైర్లు కిందకు వేలాడడం వల్ల కర్రలతో వాటిని పైకి చేసి దుక్కులు చేసుకోవాల్సిన పరిస్థితి. చెరుకు తోటల్లో కూడా తీగలు కిందకు ఉండడం వల్ల ఆ ప్రదేశంలో చెరుకును వదిలేయాల్సిన పరిస్థితి నెలకొంది. మిగతా పొలాలతో పోలిస్తే కరెంటు తీగలు వేలాడుతున్న పొలాల్లో అన్నదాతలు ఆర్థికంగా నష్టపోతున్నారు.

అటవీ భూమి ఆక్రమణకు యత్నం

శివ్వంపేట, మే 18 (ఆంధ్రజ్యోతి) : శివ్వంపేట మండలం తాళ్లపల్లితండా పరిధిలోని ప్రభుత్వ భూమిని అక్రమార్కులు కబ్జా చేసేందుకు యత్నించారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి భూమిని చదును చేశారు. శివ్వంపేట సెక్షన్ పిల్లుట్ల బీట్ పరిధిలోని తాళ్లపల్లి తండా సమీపంలోని నీలగిరి ప్లాంటేషన్‌ను ఆనుకుని ఎకరం భూమి ఉన్నది. అయితే కొందరు ట్రాక్టర్‌తో ఆ భూమిని దున్ని చదును చేశారు. అటవీ సిబ్బంది సహకారంతోనే కబ్జా జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై శివ్వంపేట సెక్షన్ ఆఫీసర్ శ్రీధర్‌ఆచార్యులును వివరణ కోరగా.. అటవీ భూమిని దున్ని విషయం తమ దృష్టికి వచ్చిందని, విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.


తాళ్లపల్లితండా పరిధిలో అటవీ భూమిని దున్నిన అక్రమార్కులు


చెర్లగూడెంలో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకు

ఉండేనా.. కూలేనా?

శిథిలావస్థలో పలు గ్రామాల ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు

- పిల్లర్లకు పగుళ్లు.. పెచ్చులూడి తేలిన ఇనుప చువ్వలు
- మరమ్మతులు చేయాలని వినతి

కంది, మే 18 (ఆంధ్రజ్యోతి) : కంది మండలంలోని పలు గ్రామాల్లో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. గ్రామీణ తాగు నీటి సరఫరా పథకంలో భాగంగా దాదాపు 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ట్యాంకుల పిల్లర్లకు పగుళ్లు ఏర్పడ్డాయి. మరికొన్ని చోట్ల పెచ్చులూడీ ఇనుప చువ్వలు తేలాయి.

మండలంలోని చెర్లగూడెం, మామిడిపల్లి, ఎర్దనూర్, తునికిళ్లతండా, మక్తఅల్లూరు, కాశీపూర్, ఎద్దుమైలారం తదితర గ్రామాల్లో వాటర్ ట్యాంకులు శిథిలావస్థకు చేరాయి. చెర్లగూడెంలోని ట్యాంకు రేపోమాపో కూలుతుందనే స్థితిలో శిథిలావస్థకు చేరింది. ప్రమాదం జరగకముందే వాటికి మరమ్మతులు చేయించాలని, అలాగే పూర్తిస్థాయిలో పాడైన వాటిని కూల్చి కొత్తవి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. మామిడిపల్లిలో రెండు ట్యాంకులు ఉండగా పాత ట్యాంకు పిల్లర్లకు పగుళ్ల రావడంతోపాటు పెచ్చులూడాయి. ఈ ట్యాంకు కూలితే కొత్త ట్యాంకులపై పడేపోయో ప్రమాదం ఉంది.

అధికారులకు నివేదికలు పంపాం..

కంది మండలంలో పలుచోట్ల ఓవర్ హెడ్ ట్యాంకులు శిథిలావస్థకు చేరిన మాట వాస్తవమే. అవసరమైన వాటికి మరమ్మతులు చేయిస్తాం. మామిడిపల్లి, చర్లగూడెం గ్రామాల్లో పూర్తిగా పాడైన ట్యాంకులను కూల్చేందుకు క్వాలిటీ కంట్రోల్ శాఖ అధికారుల అనుమతి కోసం ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే పాడైనవాటిక మరమ్మతలు చేయిస్తాం.

-రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ



మామిడిపల్లిలో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు పిల్లర్లకు పగుళ్లు


బెంగుళూరులో నిర్వహించిన పోటీలో బీవీఆర్ఐటీ విద్యార్థులు

జాతీయ స్థాయి ప్రాజెక్టులో
బీవీఆర్ఐటీకి రెండో స్థానం

నర్సాపూర్, మే 18(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ప్రాజెక్టు పోటీల్లో నర్సాపూర్‌కు చెందిన బీవీఆర్ఐటీ రెండవ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బెంగుళూరులో నిర్వహించిన ఎల్‌అండ్‌టీ టెక్నాలజీ నిర్వహించిన ఫైనల్ పోటీల్లో దేశవ్యాప్తంగా 569 విద్యాసంస్థల నుంచి విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చూపారన్నారు. ఇందులో బీవీఆర్‌టీ చెందిన విద్యార్థులు రెండవస్థానం సాధించారన్నారు. ఈ పోటీల్లో బీవీఆర్ఐటీకి చెందిన ఈసీఈ విభాగంకు చెందిన విద్యార్థులు అవార్డుతో పాటు మూడు లక్షల నగదు బహుమతి పొందినట్లు తెలిపారు.

ఆస్పత్రి భవనంపైకి ఎక్కి యువకుడి హల్‌చల్


ఆసుపత్రి భవనం పైకి ఎక్కిన మధు

జోగిపేట రూరల్, మే18 (ఆంధ్రజ్యోతి): జోగిపేట ప్రభుత్వ వంద పడకల ఆసుపత్రి పైకి ఎక్కి ఆదివారం ఓ యువకుడు హల్‌చల్ చేశాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు మెదక్ జిల్లా టేక్మాల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బోయిని మధు భార్య కుటుంబ తగాదాలతో పుట్టింటికి వెళ్లి తిరిగి కాపురానికి రావడం లేదు. దీంతో మనస్తాపానికి గురైన అతడు మద్యం మత్తులో తన ఇంట్లో గడ్డి మందు సేవించి ఆత్మహత్యయత్నానికి పాల్పడాడు. గమనించిన కుటుంబ సభ్యులు మధును కాపాడేందుకు 108 అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడికి చికిత్స అందించిన వైద్యులు సంగారెడ్డికి రిఫర్ చేశారు. అక్కడి నుంచి సంగారెడ్డికి తరలిసున్న క్రమంలో మధు అంబులెన్స్ సిబ్బందికి సహకరించకపోవడంతోపాటు సిబ్బంది తనపై దాడి చేసి దురుసుగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ ఆసుపత్రి భనంపై పైకి ఎక్కాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకోని మధుకు నచ్చజెప్పి కిందికి దింపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


ఇస్తారి(ఫైల్)

గజ్వేల్ రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని శ్రీగిరిపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పేరక ఇస్తారి(44) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మానవతావాదులు ఇస్తారి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడి

● చీడ పీడల నివారణ ● తగ్గనున్న పెట్టుబడితో రైతులకు మేలు


అక్కన్నపేట మండలం ధర్మారంలో సాగు చేసిన కొత్తిమీర పంట

అక్కన్నపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటమార్పిడీ విధానంతో ఎక్కువ దిగుబడి సాధించడంతో పాటు చీడపీడల నివారణతో పెట్టుబడి ఖర్చుతూ గణనీయంగా తగ్గించుకోవచ్చని వ్యవసాయ అధికారులు, నిపుణులు సూచిస్తున్నారు. ప్రతి పంటకు పంట మార్పిడి పద్ధతి పాటించాలని, ఒకే పంట పండిస్తే నేలలోని పోషకాలు పంటకు సరిగ్గా అందవు. అలాగే విభిన్న పంటలు రకరకాల పోషకాలను వినియోగించుకుంటాయి కాబట్టి అన్ని పోషకాలు వినియోగం కావాలంటే వివిధ పంటలు పండించాలి. ఒకే పంటను పండిస్తే రసాయన ఎరువుల వినియోగం పెరుగుతుంది. అలాగే నేల సహజ స్వభావాన్ని కోల్పోతుంది. ఒకే పంట రకం సాగుతో దిగుబడి కూడా పడిపోతుంది. ఈ వేసవిలో పంట మార్పిడిపై రైతులకు ఆయా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను వ్యవసాయ అధికారులు నిర్వహిస్తున్నారు.

ఎన్నో ప్రయోజనాలు..

ప్రతీ పంటకు భూమిలో అన్ని రకాల సూక్ష్మధాతువుల వినియోగం పూర్తికావాలంటే కొన్నిసార్లు గుబురు వేరు మొక్క పంటలు, మరో పంటకు తల్లివేరు రకం పంటలను సాగు చేయాలి. వరి, పొద్దు తిరుగుడు, టమాట, మిరప తదితర పంటలు గుబురువేరు మొక్కలు కలిగిన పంటలు. అలాగే మొక్కజొన్న, పత్తి, కంది, నువ్వులు, పజొన్న, పెసర, కాకర, దోస, బీర, చిక్కుడు వంటి ఆహార, కూరగాయ పంటలు తల్లివేరు మొక్కల పంటలు. ఒకే రకం పంటల్లో శిలీంధ్ర రోగాలు, కీటకాలు ఎక్కువ ఆశిస్తాయి. పంటమార్పిడితో రోగాలు అన్ని పంటలకు రావు. పంట మార్పిడితో సహజంగా కొన్ని రకాల పురుగులు, కలుపు మొక్కలు నేలలో నాశనం అవుతాయి. మొక్కలు ఏపుగా పెరుగుతాయి. వేసవి దక్కులతో పంటలను ఆశించే పురుగులు ఎండ వేడికి చనిపోతాయి. సేంద్రియ పదార్థం పెరిగి భూ భౌతిక స్థితి గణనీయంగా మెరుగుపడుతుంది. మొక్కలకు నత్రజని వినియోగం తగ్గుతుంది.

ఈ సూచనలు పాటించాలి..

దీర్ఘకాలిక పంటలు సాగుచేసే పొలాల్లో పంట మార్పిడి కింద స్వల్పకాలిక పంటలైన కూరగాయలు సాగు చేయాలి. లెగ్యూమ్ జాతి పైర్లు వేస్తే రైజోబియం బుడిసెలు ఏర్పడతాయి. ఈ మొక్కలు పచ్చిరొట్ట ఎరువుగా మారేందుకు భూమిలో కలియదున్నాలి. చిక్కుడు జాతి మొక్కలతో నేలలో భూసారం పెరుగుతుంది. ఒకసారి జొన్న వేస్తే మరుసటి ఏడాది ఆముదం లేదా కంది, మొక్కజొన్న వంటి పంటలు వేసుకోవాలి. రెండు సార్లు దీర్ఘకాలిక పంటలేస్తే మరోమారు స్వల్పకాలిక పంటలైన కూరగాయల సాగుచేయాలి. వరి తరువాత పప్పు దినుసులు సాగుచేసుకోవాలి. దీనితో నేలలో నెమటోడ సంఖ్య తగ్గుతుంది. తేలిక భూముల్లో నీటిపారకం కింద వేరుశనగ లేదా చిక్కుడు పంటలు వేసుకో వాలి. బెండ, బీర, దొండ లాంటి పంటల తర్వాత బంతిపూలు, నువ్వులు వేసుకోవాలి. వయ్యారిబామ కలుపు మొక్కల నివారణకు గడ్డిజాతి మొక్కలు సాగు చేయాలి. తక్కువ సారముండే భూముల్లో జనుము, జీలుగ, పచ్చి రొట్ట విత్తనాలు వేసి మొక్కల పూత సమయంలో భూమిలో కలిసేలా నాలుగు సాళ్ల దున్నాలి.

మిశ్రమ పంటలు వేసుకోవాలి..



వేరుశనగ పంటను వెంటవెంటనే అస్సలు వేయొద్దు. అలా చేస్తే ఎర్రగొంగలి పురుగు, శనగపచ్చపురుగు, లద్దె పురుగు, ఆకుమచ్చ తెగులు, మొవ్వ కుళ్లు తెగుళ్లు వస్తాయి. బెండ తరువాత పత్తిపంట వేయాలి. నులిపురుగులు ఉండే ప్రాంతంలో వంగ, బెండ, టొమాటో, ఉలవ, మినుము, పెసర పంటలు వేసుకోవాలి. తేలిక నేలలు, ఎర్ర, ఇసుక, ఎర్రబంకమట్టి నేలలు, రేగడి నేలల్లో మిశ్రమ పంటలు వేసుకోవాలి.

-బి.శ్రీనివాస్, వ్యవసాయ శాఖ హుస్నాబాద్ డివిజన్ అధికారి

ఇంటిగోడను ఢీకొట్టిన ట్రాక్టర్.. డ్రైవర్ మృతి


రాఘవ మృతదేహం

నంగునూరు,మే 18 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ రోడ్డు డివైడర్‌ను దాటి ఓ ఇంటి గోడను ఢీకొన్న సంఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి నంగునూరు మండలం పాలమాకులలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సంపంగి రాఘవ(16) రాత్రి వడ్లను ట్రాక్టర్లులో కొనుగోలు కేంద్రానికి తరలించాడు. తిరిగి వస్తున్న క్రమంలో డివైడర్‌ను దాటి మరోపక్క దూసుకెళ్లడంతో రాఘవ రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. దూసుకెళ్లిన ట్రాక్టర్ రోడ్డు పక్కన ఉన్న ఇంటి వరండా, గోడను ఢీ కొట్టి నిలిచిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న రాజగోపాల్‌పేట ఎస్ఐ ఆసిఫ్, ప్రొబేషనల్ ఎస్ఐ సౌజన్య సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకొని రాఘవకు సీపీఆర్ చేస్తూ అంబులెన్స్‌లో సిద్దిపేట ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు.


మార్డి పెద్ద చెరువులో కట్టలు వేసి కబ్జాకు యత్నిస్తున్న దృశ్యం

మార్డి పెద్దచెరువు కబ్జా..!

- అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
- నీటి నిల్వ ప్రాంతంలోనే కట్టలు వేసి యథేచ్ఛగా ఆక్రమణ

కల్హేర్, మే 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మార్డి పెద్ద చెరువు కబ్జాకు గురవుతున్నదని స్థానికులు తెలిపారు. హైదరాబాద్‌కు కెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి చెరువు నీటి నిల్వ ప్రాంతంలో ఎక్స్‌కావేటర్‌తో కట్టలు వేసి యథేచ్ఛగా కబ్జాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోగా కబ్జాకు పాల్పడుతున్న వ్యక్తికే వంత పాడుతున్నారని ఆ చెరువు ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కబ్జాకు పాల్పడిన వ్యక్తిని మార్డి గ్రామ రైతులు ప్రశ్నించగా తనకు పట్టా పాసు పుస్తకం ఉందని దీని ఆధారంగా తన సర్వే నంబర్‌లోనే కబ్జా చేస్తున్నట్లు తెలిపాడని రైతులు తెలిపారు. అంతేకాకుండా తహసీల్దార్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు తన భూమి ఇక్కడే ఉన్నట్లు చెప్పారని సమాధానం ఇవ్వడంతో ఆశ్చర్యపోవడం రైతుల వంతైంది. పూర్తి స్థాయి చెరువు ఉన్న ప్రాంతంలో భూమి ఆక్రమించి చదును చేయడం ఏమిటని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కబ్జా విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు. దీనిపై కల్హేర్ తహసీల్దార్ శివ శ్రీనివాస్‌ను వివరణ కోరగా రైతుల ఫిర్యాదుకు స్పందించి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పంపించి పరిశీలన జరిపించామన్నారు. పూర్తి వివరాల కోసం నీటిపారుదల శాఖ అధికారులకు లేఖ రాసినట్లు తెలిపారు. వారి నివేదిక ఆధారంగా కబ్జాకు పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైర్ చోరీ


పగలగొట్టిన ట్రాన్స్‌ఫార్మర్

కోహెడ, మే 18 (ఆంధ్రజ్యోతి) : కోహెడ మండలంలోని తీగలకుంటపల్లి గ్రామంలో గుర్తుతెలియని దుండగులు రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్‌వైర్‌ను దొంగిలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం ఉదయం వ్యవసాయ బావుల వద్దకు వెళ్లిన రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి కనిపించాయి. దగ్గరికి వెళ్లి చూసిన వారు అందులోని కాపర్ వైర్‌ను దుండగులు చోరీ చేసినట్లు గుర్తించారు. గోవిందు రాజాసాగర్, కరెడ్ల బాపురెడ్డికి చెందిన వ్యవసాయ క్షేత్రాల్లోని రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైర్‌ను చోరీ చేశారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్రాన్స్‌కో ఏఈ రవీందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వరుస ఘటనలతో రైతుల్లో ఆందోళన

మండలంలో వరుస ఘటనలు చోటుచేసుకుంటుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా తీగలకుంటపల్లిలో రెండు, ఇటీవల గొట్లమిట్టలో రెండు, కూరెళ్లలో ఒకటి చొప్పున ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు ధ్వంసం చేసి కాపర్ వైరును ఎత్తుకెళ్లారు. నెల రోజుల్లో 5 ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్‌ను చోరీ చేయడంపై అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిఘా ఏర్పాటుచేసి నిందితులను అందుపులోకి తీసుకోవాలని కోరుతున్నారు.


అవాంచ జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

టెన్త్ సప్లిమెంటరీకి సన్నద్ధం

● విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ● జూన్ 3 నుంచి పరీక్షలు

మెదక్ అర్బన్, మే 18(ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షల్లో అనుత్తీర్ణులైన విద్యార్థులపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఉత్తీర్ణత శాతం మెరుగయ్యేలా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం చేస్తోంది. జూన్ 3 నుంచి పరీక్షలు ప్రారంభం కానుండగా.. ప్రత్యేక తరగతుల నిర్వహణకు డీఈవో రాధాకిషన్ ఆదేశాలిచ్చారు. ఈ మేరకు అనుత్తీర్ణులైన విద్యార్థులకు బోధన అందిస్తున్నారు. ఉత్తీర్ణత శాతం తక్కువగా నమోదైన బడుల్లో ఆన్‌లైన్, ప్రత్యక్ష తరగతుల ద్వారా పాఠాలు బోధిస్తున్నారు. మెదక్ జిల్లాలో గతం కంటే మెరుగైన ఫలితాలతో ఈ సారి 12వ స్థానంలో నిలిచింది. మొత్తం 10,370 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 10,045 మంది విద్యార్థులు పాసయ్యారు. 325 మంది అనుత్తీర్ణులయ్యారు. ప్రథమ భాషలో 173 మంది. ఇంగ్లిష్‌లో 127, సైన్స్ 116, గణితం 106, సాంఘికశాస్త్రం 34, ద్వితీయభాషలో 22 మంది ఫెయిలయ్యారు. వీరికి సబ్జెక్టులపై భయం తొలగించి ఉత్తీర్ణలయ్యేలా చర్యలు చేపట్టారు.

ఉత్తీర్ణత శాతం పెంచేలా చర్యలు

టెన్త్‌లో అనుత్తీర్ణులైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించాం. సబ్జెక్టులు తప్పిన వారంతా ఉత్తీర్ణలయ్యేలా టీచర్లు చొరవ తీసుకుంటున్నారు. ప్రత్యేక తరగతుల ఆన్‌లైన్‌లో పాఠాలు బోధిస్తున్నారు. వాట్సాప్ ద్వారా విద్యార్థుల సందేహాలు నివృత్తి చేస్తున్నారు. సాధ్యమైనంత వరకు ఉత్తీర్ణత శాతం పెంచేలా చొరవ తీసుకుంటున్నాం.

-రాధాకిషన్, డీఈవో మెదక్

పదిరోజులని.. నెలలకొద్ది మూసివేత

- మరమ్మతుల పేరుతో రైల్వేగేట్ క్లోజ్
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ఈదులనాగులపల్లి గ్రామస్థులు
- శాశ్వతంగా మూసివేసే ధోరణిలో అధికారులు!
- ఇదే జరిగితే ఈదులనాగులపల్లి, వెలిమల గ్రామస్థులకు పెరగనున్న దూరాభారం


నాగులపల్లి వద్ద మూసి వేసిన రైల్వే గేట్

రామచంద్రాపురం, మే 18 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలంలోని కొల్లూరు అవుటర్ రింగ్ రోడ్డు జంక్షన్ నుంచి ఈదులనాగులపల్లి గ్రామాన్ని కలుపుకుంటూ రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మోకిల వరకు వంద ఫీట్ల రోడ్డు నిర్మాణానికి ఐదేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఈదులనాగులపల్లి వద్ద రోడ్డు కాకుండా ఫ్లైఓవర్ నిర్మిస్తామని చెప్పడంతో గ్రామస్థులు వ్యతిరేకించారు. మా భూములు తీసుకుని మా రోడ్డును మా గ్రామం నుంచి తీసుకువెళ్లకుండా ఫ్లై ఓవర్ నిర్మిస్తామని చెప్పడమేమిటని ప్రశ్నించారు. అయినా అధికారులు పట్టించుకోకుండా కొన్నిరోజుల తరువాత సర్వీస్ రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చినా అమలు చేయకపోవడంతో ఈ గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈదులనాగులపల్లి గ్రామస్థులు వెలిమలకు వెళ్లాలంటే ప్రధానంగా రైల్వే గేట్ నుంచి రాకపోకలు సాగించాల్సి ఉంటుంది.

రైల్వేగేట్ మూసి వేతతో అవస్థలు

రైల్వే లైన్ మరమ్మతుల కారణంగా ఓ పది రోజులు రైల్వేగేట్ మూసి వేస్తునట్టు గత మార్చి 8న ఓ ప్రకటనను విడుదల చేశారు. అయితే గ్రామం సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం పరిధిలో ఉండగా, ఈ ప్రకటన ప్రతులను మాత్రం పటాన్‌చెరు డీఎస్పీ, పటాన్‌చెరు ఆర్టీసీ మేనేజర్, తెల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, శంకర్‌పల్లి(రంగారెడ్డి జిల్లా) తహశీల్దార్‌కి అందించి చేతులు దులుపుకున్నారు. ఆ ప్రకటన ప్రకారం పదిరోజుల్లో రైల్వేగేట్ తెరువాల్సి ఉన్నా నేటికి తెరువలేదు. ఈదులనాగులపల్లి రైల్వేగేట్‌ను శాశ్వతంగా తొలగించాలని ఆలోచనలో అధికారులు ఉన్నట్లు తెలుస్తుంది. ఇదే నిజమైతే ఈదులనాగులపల్లి, వెలిమెల, గ్రామస్థులు సుమారు మూడు కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సివస్తుంది.

శిథిలమైన ర్యాంపు రోడ్డుపై ప్రయాణం

రైల్వే గేట్ వద్ద గేటు మూయడంతో వెలిమెల, పాటి తదితర గ్రామాలకు వెళ్లేందుకు ఓఆర్‌ఆర్ వద్ద శిథిలమైన ర్యాంపు రోడ్డును ప్రయాణికులు ఆశ్రయిస్తున్నారు. దీంతో ఈ రోడ్డుపై తీవ్రమైన ఒత్తిడి పడుతోంది. ఒక వేళ ఈ రోడ్డు ధ్వంసమైతే ఇక్కడి గ్రామాల ప్రజలు 10 నుంచి 20కిలో మీటర్ల దూరం అదనంగా ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఈ రోడ్ల మార్పులు, చేర్పులు అభివృద్ధి పేరిట భూస్వాములకు లబ్ధిచేకూర్చడానికే అని స్థానికులు పేర్కొంటున్నారు. రైల్వే గేట్ తెరుచుకోవడం, ఓఆర్‌ఆర్ జంక్షన్ వద్ద నిర్మిస్తున్న రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి పూర్తయితేనే దూర సమస్యకు పరిష్కారమవుతుంది. ఇప్పటికే పటాన్‌చెరు నుంచి లింగంపల్లికి రాకపోకలు సాగిస్తున్న రూట్లలో బస్సులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు.

రేషన్‌కార్డులో పేరు తొలగించాలంటే డబ్బులివ్వాల్సిందే!

మద్దూరు, మే 18 ఆంధ్రజ్యోతి) : కుటుంబ సభ్యుల రేషన్‌కార్డు నుంచి పేరు తొలగించుకునేందుకు దరఖాస్తు చేసుకుంటున్న పేద కుటుంబాలను నుంచి రెవెన్యూ కార్యాలయంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్కడాక్కడా రెవెన్యూ ఉద్యోగులు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుపడుతున్నా వారి తీరు మారడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. వివాహం చేసుకున్న దంపతులు కొత్తగా రేషన్‌కార్డుకు పొందేందుకు పాత రేషన్ కార్డుల నుంచి తమ పేర్ల తొలగించుకునేందుకు మండల రెవెన్యూ కార్యాలయాలకు వెళ్తున్నారు. ఇదే అదునుగా వారి నుంచి అధికారులు, సిబ్బంది రూ.100 నుంచి 200 వరకు వసూల్ చేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో పాటు విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకునే సమయాల్లో సంతకాలకు రైతుల వద్ద నుంచి రూ.1000 తీసుకుంటున్నట్లు తెలిసింది. ఈ విషయమై తహసీల్దార్ రహీంను సంప్రదించగా తన దృష్టికి రాలేదని, ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు.

న్యూస్ బాక్స్

నేడు ఉచిత వైద్యశిబిరాలు

మద్దూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలతో పాటు లద్నూరు ఉన్నత పాఠశాలల్లో సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు మద్దూరు పీహెచ్‌సీ వైద్యాధికారి రజిత తెలిపారు. శంకరాయ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు కంటిపరీక్షలు జరుపుతారని, కంటిశుక్లాల శస్త్రచికిత్స అవసరం ఉన్నవారికి ఉచితంగా ఆపరేషన్లు జరుపుతామన్నారు. ఈ అవకాశాన్ని మద్దూరు, ధూళిమిట్ట మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

మర్కుక్, మే 18 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండలం పాములపర్తి గ్రామానికి చెందిన బైండ్ల మహేష్‌కు సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థికసాయం మంజూరైంది. ఈ మేరకు ఆదివారం మాజీ ఎంపీపీ పాండుగౌడ్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు పిట్ల మహేష్ చేతుల మీదుగా రూ.32,500 విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం

జగదేవ్‌పూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మునిగడప గ్రామానికి చెందిన ఉమ్మరాజు లక్ష్మి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా విషయం తెలుసుకున్న గజ్వేల్ నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షుడు రాచమల్ల ఎల్లేష్, మండల రజక సంఘం నాయకులు ఆదివారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు రూ. 5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వెంట రజక సంఘం నాయకులు వడ్లకొండ శ్రీనివాస్, రాచకొండ బాల్‌నరసయ్య, అక్కారం నరసింహులు, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆడపడచుల వివాహానికి అండగా..

మర్కుక్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన దర్శనాల కవిత కనకయ్యల కూతురు స్పందన వివాహానికి బీఆర్ఎస్ బీసీసెల్ అధ్యక్షుడు మేకల కనకయ్య ముదిరాజ్, పార్టీ నాయకులు అండగా నిలిచారు. ఆదివారం ఆయన బీఆర్ఎస్ పాములపర్తి గ్రామ శాఖ అధ్యక్షుడు పిట్ల మహేష్ చెక్కల నర్సింలు, కొట్టాల మహేష్ తదితరులతో కలిసి నవ వధువుకు రూ.5వేల ఆర్థిసాయాన్ని అందజేశారు.

● **కొండపాక:** దుద్దెడ గ్రామానికి చెందిన పిల్లి బాల్‌కీ నర్సయ్య - కళావతిల కూతురు భాగ్యలక్ష్మికి వివాహ నిమిత్తం గ్రామ మాజీ సర్పంచ్ ఆరెపల్లి మహదేవ్ గౌడ్ పుస్తె మట్టెలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వధువు కుటుంబ సభ్యులు మహదేవ్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు పితృ వియోగం

చేర్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామానికి చెందిన చేర్యాల పీఏసీఎస్ చైర్మన్ మేరుగు కృష్ణ పితృవియోగం పొందారు. కృష్ణ తండ్రి మేరుగు నర్సయ్య (68) అనారోగ్యంతో మృతిచెందారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, శెట్టిపల్లి సత్తిరెడ్డి, తాడూరి రవీందర్ తదితరులు సంతాపం వ్యక్తంచేస్తూ కుటుంబసభ్యులను పరామర్శించారు.

యువత సన్మార్గంలో పయనించాలి

మద్దూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): యువత సన్మార్గంలో పయనించాలని, గంజాయి ఇతర మత్తుపదార్థాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకోవద్దని మద్దూరు ఎస్ఐ షేక్ మహబూబ్ అన్నారు. మద్దూరు మండలకేంద్రంలో శనివారం రాత్రి పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో కనువిప్పు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరూ తమవంతుగా రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన తీరుపట్ల గమనిస్తూ ఉండాలన్నారు. అంతకుముందు కళాబృందం సభ్యులు పలు ప్రదర్శనలతో అవగాహన కల్పించారు.

పంచాయతీల్లో ఎన్ఎంఆర్ కార్మికులకు.. ఉద్వాసన తప్పదా..!

- జిల్లా వ్యాప్తంగా 1000 మంది కార్మికులు
- ఇప్పటికే 600 మంది తొలగింపు
- ప్రత్యేక పాలన వ్యవస్థ వచ్చినప్పటి నుంచి అందని జీతాలు
- అలాగే నెట్టుకొస్తున్నా ఎన్ఎంఆర్ కార్మికులపై వేలాడుతున్న కత్తి
- కార్మికులకు న్యాయం చేయాలని కార్మిక సంఘాల డిమాండ్



కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు (ఫైల్)

సిద్దిపేట అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గ్రామపంచాయతీల్లో ఎంఎన్ఆర్ కింద పని చేసే కార్మికులను తొలగించే యత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. గ్రామపంచాయతీల్లో పనిచేయడానికి మల్టీపర్పస్ విధానంలో కార్మికులను జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామపంచాయతీలో ప్రభుత్వం నియమించుకోగా వారి సేవలు సరిపోకపోవడంతో ఎంఎన్ఆర్ కింద ప్రజాప్రతినిధులు జిల్లావ్యాప్తంగా ఆయా గ్రామపంచాయతీల్లో సుమారు 1000 మంది కార్మికులను నియమించుకున్నారు. ప్రస్తుతం ఎన్ఎంఆర్ కింద గ్రామపంచాయతీలలో పని చేస్తున్న కార్మికులకు ఉద్వాసన పలికే యత్నాలు సాగుతున్నాయి. ఎన్ఎంఆర్ కింద నియమించుకున్న కార్మికులను జీతాలు ఇవ్వలేమనే కారణాలతో తొలగించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని, ఇప్పటికే జిల్లావ్యాప్తంగా వందల మంది కార్మికులను తొలగించారని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.

సుమారు 600 మంది కార్మికుల తొలగింపు

జిల్లా వ్యాప్తంగా 514 గ్రామపంచాయతీల్లో మొత్తంగా 2,500 మంది కార్మికులు పనిచేస్తున్నారు. అందులో మల్టీ పర్పస్ విధానంలో ప్రభుత్వం సుమారు 1,500 మంది కార్మికులను నియమించుకోగా ఎన్ఎంఆర్ కింద ప్రజాప్రతినిధులు వెయ్యి మంది కార్మికులను నియమించుకున్నారు. ప్రజాప్రతినిధుల పదవీకాలం పూర్తయి ప్రత్యేకాధికారుల పాలన మొదలైనప్పటి నుంచి ఎంఎన్ఆర్ కింద నియమించుకున్న కార్మికులకు జీతాలు రావడం లేదు. నిధుల్లేవ్.. జీతాలు ఇవ్వలేమనే సాకుతో ఇప్పటికే 600 మంది కార్మికులను ప్రభుత్వం విధుల నుండి తొలగించిందని వారిని విధుల్లోకి తీసుకొని వేతనాలు ఇవ్వాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఏడాది కాలంగా ఎదురుచూపులు

దాదాపు సంవత్సర కాలం నుంచి వేతనాలు రాకున్నా కూడా కార్మికులు గ్రామపంచాయతీలలో పని చేస్తున్నారు. కొన్ని గ్రామపంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులు కాస్త ఖర్చుల వరకు సర్దుబాటు చేసి ఇచ్చినా, మరికొన్ని గ్రామపంచాయతీలలో పూర్తిస్థాయిలో వేతనాలు రాకున్నా కూడా పనిచేస్తున్నారు. ప్రజాప్రతినిధుల వ్యవస్థ మళ్లీ వస్తుంది తమకు జీతాలు వస్తాయనే ఆశతో కార్మికులు పనిచేస్తున్నారని వారిని కార్మికులుగా గుర్తించి వేతనాలు ఇవ్వాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నాయి. మల్టీపర్పస్ విధానంలో పనిచేస్తున్న కార్మికులకు రూ. 9,500 ఇవ్వగా ఎన్ఎంఆర్ కింద నియమించిన కార్మికులకు 5000 నుంచి 6000 వరకు జీతాలు ఉన్నాయి.

అకారణంగా కార్మికులను తొలగించవద్దు



అనేక నెలల పాటు గ్రామ పంచాయతీల్లో కార్మికుల సేవలను వినియోగించుకొని, తీరా జీతాలు ఇవ్వలేమంటూ వారిని తొలగించడం అన్యాయం. ప్రజా ప్రతినిధుల వ్యవస్థ వచ్చే వరకు ప్రత్యేక పాలన అధికారులు ఎంఎన్ఆర్ కింద ఎంపికైన కార్మికులకు వేతనాలు చెల్లించాలి. ఇప్పటికే వందల మంది కార్మికులను తొలగించారు. ఇది చాలదన్నట్టు కార్మికులను తొలగించే ప్రయత్నాలు ఇంకా కొనసాగుతున్నాయి. ఇందుకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడుతున్నాం భవిష్యత్తులో పోరాటానికి కార్యాచరణను రూపొందించుకుంటాం.

- తునికి మహేష్, జీపీ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

సర్కారు బడుల అభివృద్ధికి నిధులు

● ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ మనుచౌదరి



శిథిలావస్థలో తోటపల్లి ప్రాథమిక పాఠశాల
పెచ్చులూడుతున్న తరగతి గది పై కప్పు

హుస్నాబాద్‌రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణం కోసం, తోటపల్లి ప్రాథమిక పాఠశాలల అభివృద్ధి కోసం నిధులు మంజూరయ్యాయి. డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ. 30.80 లక్షల నిధులు మంజూరు చేస్తూ కలెక్టర్ మనుచౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నో ఏళ్లుగా శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారిన తోటపల్లి ప్రాథమిక పాఠశాలకు అదనపు తరగతి గది నిర్మాణం కోసం రూ.14లక్షలు, పోతారం(ఎస్) జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణం, మూత్రశాలల నిర్మాణం కోసం రూ.16.80 లక్షలు నిధులు మంజూరు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామీణ పాఠశాల అభ్యున్నతి కోసం రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నిధుల మంజూరుకు కృషిచేయడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

కవి వెంకట్‌కు పురస్కారాల ప్రదానం



పురస్కారం అందుకుంటున్న కవి వెంకట్

చేర్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం ఐనాపూర్ గ్రామానికి చెందిన పద్యకవి వెంకట్ జాతీయ కీర్తిరత్న, గౌతమేశ్వర సాహితీ పురస్కారాలు అందుకున్నారు. సాహితీరంగంలో రాణిస్తుండటాన్ని గుర్తించిన ఆర్యాణి సకల కళావేదిక, గౌతమేశ్వర సాహి తీ కళాసేవాసంస్థల నిర్వాహకులు వెంకట్‌ను పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ మేరకు పెద్దపల్లి జిల్లా మంథని మండలకేంద్రంలోని జానకీరామ్ కల్యాణమండపంలో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు వెంకట్‌కు బంగారు కంకణం, జ్ఞాపిక, అభినందన పత్రం అందించి సత్కరించారు.

చదువు సమాజం పట్ల బాధ్యత పెంచుతుంది



ఉత్తమ ప్రతిభ కనబరిచిన నీలకంఠ సమాజం విద్యార్థులకు పురస్కారం అందజేస్తున్న మాజీమంత్రి

సిద్దిపేట కల్చరల్/సిద్దిపేట రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): విద్య కేవలం ఉద్యోగం కోసమే కాదని, చదువు దేశం, సమాజం పట్ల బాధ్యతను పెంచుతుందని మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని నీలకంఠ నగర్‌లోని శ్రీ గౌరీనీలకంఠేశ్వర ఆలయం చతుర్ త్రిశంతి (34వ) వార్షికోత్సవంలో భాగంగా శ్రీ గౌరీసహిత నీలకంఠేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నీలకంఠ సమాజ విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనభరిచిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగానే రథాన్ని అద్భుతంగా తయారు చేసిన శిల్పిని సన్మానించారు. అదేవిధంగా నారాయణరావుపేట మండలం కోదండరావుపల్లి, ఇబ్రహీంపూర్ గ్రామాల్లో పోచమ్మ ఉత్సావాల్లో, పెద్దమ్మ ఉత్సవాల్లో మాజీమంత్రి హరీశ్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పోచమ్మ తల్లి ఉత్సవాలకు రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. వెంట బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కోనయ్యగారి ఎల్లయ్య, మాజీ ఎంపీపీ బాలకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమావేశంలో జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

బెజ్జంకి, మే 18 (ఆంధ్రజ్యోతి) : బెజ్జంకి మండలం బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ (2002-03) బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం జరుపుకుని సందడి చేశారు. పరస్పరం అప్యాయంగా పలకరించుకుంటూ కుటుంబ క్షేమ సమాచారన్ని పంచుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆట పాటలతో సరదాగా గడిపారు. తమకు విద్య నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు.

దళిత యువకుడిపై దాడి అమానుషం

హుస్నాబాద్/అక్కన్నపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల కేంద్రంలో బత్తుల మహేందర్ అనే దళిత యువకుడిపై అకారణంగా దాడి చేసి కులం పేరుతో దూషించిన ట్రైనీ ఎస్ఐ బార్గవ్‌పై చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి కండె సుధాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అమాయకుడైన మహేందర్‌ను విచక్షణ రహితంగా కొట్టడం దారుణమన్నారు. దాడి కారణంగా ఆసుపత్రి పాలైన మహేందర్‌కు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో హుస్నాబాద్, అక్కన్నపేట దళిత సంఘాల నాయకులు ముక్కెర సంపత్‌కుమార్, కొలుగూరి అశోక్ తదితరులు ఉన్నారు.

ఆలయానికి రూ. లక్ష విరాళం



విరాళమిచ్చిన రాజేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

నంగునూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): నంగునూరులోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ గోపురము నిర్మాణం కోసం వ్యాపారవేత్త వంగ రాజేశ్వర్‌రెడ్డి విరాళాన్ని అందజేశారు. నంగునూరు మండల కేంద్రంలోని రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నిర్మించే శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ గోపురము నిర్మాణానికి ఆదివారం రూ.1లక్ష అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌రెడ్డిని రెడ్డి సంఘం సభ్యులు సన్మానం చేశారు. అంతకుముందు గ్రామంలోని నల్ల పోచమ్మ అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోధుమకుంట మల్లారెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షుడు పందిళ్ల రాంరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు

నేడు శ్రీ వేణుగోపాలస్వామి విమాన రథోత్సవం



ఆలయంలో కొలువైన స్వామి వారు

వర్గల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండలకేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామివారి విమాన రథోత్సవానికి ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. వేలాది మంది భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయం వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 4.30 గంటలకు రథ ప్రతిష్ఠ తదుపరి విమాన రథంపై దేవతా మూర్తులైన రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామివారిని అధిష్ఠింపజేసి ఉదయం 8.00 గంటలకు ఆలయం వద్ద నుంచి రథోత్సవం ప్రారంభం అవుతుందని ఆలయ వేద పండితులు వేదాంతం మురళీధర చార్యులు తెలిపారు. రథోత్సవంలో భక్తుల భజనలు, మహిళలచే కోలాటం కార్యక్రమంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రథోత్సవం అనంతరం ఆలయంలో సుదర్శన హోమం, మహా పూర్ణాహుతి, భక్తులకు అన్న ప్రసాద వితర ఉంటుందన్నారు. ఉత్సవాల సందర్భంగా గౌరారం పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

జవాన్ కుటుంబానికి 'చెరుకు' పరామర్శ



జవాన్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న కాంగ్రెస్ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక, మే 18 (ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం చౌదర్‌పల్లిలో భూమి కబ్జాకు గురైందని ఆవేదన వ్యక్తం చేసిన జవాన్ రామస్వామి కుటుంబాన్ని ఆదివారం కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. మూడు దశాబ్దాల క్రితం కొనుగోలు చేసి, కాస్తు చేస్తున్న భూమిని అక్రమించుకోవాలని చూస్తున్న వారి ఆటలు సాగవని ఆయన హెచ్చరించారు. దేశం కోసం పోరాడుతున్న జవాన్ కుటుంబానికి అండగా కాంగ్రెస్‌పార్టీ ఉంటుందనీ, ఆవేదన చెందవద్దని బాధితుడికి భరోసా ఇచ్చారు. ఆయన వెంట పాతూరి వెంకట్‌గౌడ్ తదితరులున్నారు.

అర్హులనే రాజీవ్ యువశక్తి పథకానికి ఎంపిక చేయాలి

హుస్నాబాద్ టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ శక్తి పథకాన్ని అర్హులైన యువకులకే అందించాలని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి సుద్దాల చంద్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ పథకం కోసం వేలాది మంది నిరుద్యోగ యువత ఎదురుచూస్తున్నారని తెలిపారు. పేద నిరుద్యోగ యువకులకు కాకుండా కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వారికి ఈ పథకాన్ని వర్తింపజేస్తే బీఆర్ఎస్ పక్షాన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లలో అర్హులకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్ రెడ్డి, టీఆర్ఎస్‌వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరంపల్లి పరశురాములు, బీఆర్ఎస్ నాయకులు తదితరులున్నారు.

హిందూ ఏక్తా యాత్రను విజయవంతం చేయాలి



కోహెడలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

కోహెడ, మే 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22న కరీంనగర్‌లో నిర్వహించే హిందూ ఏక్తా యాత్రను విజయవంతం చేయాలని ఏక్తాయాత్ర ఇన్‌చార్జి పైడిపల్లి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం కోహెడలో బీజేపీ మండల అధ్యక్షుడు జాలిగం రమేష్ అధ్యక్షతన హిందూ ఏక్తాయాత్ర మండల సన్నాహక సమావేశం నిర్వహించారు. దీనికి శ్రీనివాస్ గౌడ్ హాజరై మాట్లాడారు. మండలంలోని 27 గ్రామాల్లో ఒక్కొక్క ఎన్నికల బూత్‌కు 30 మందికి తగ్గకుండా ఏక్తాయాత్రకు తీసుకరావాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం ఏక్తా యాత్ర పోస్టర్ ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జాలిగం రమేష్, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఖమ్మం వెంకటేశం, పిల్లి నర్సయ్య, మ్యాకాల చంద్రశేఖర్‌రెడ్డి, తూటి బాపురెడ్డి, మ్యాకాల సురేందర్ రెడ్డి, గుగ్గిళ్ల శ్రీనివాస్, మ్యాకాల రజినీకాంత్‌రెడ్డి, బండ జగన్, కొండబత్తిని సతీష్ తదితరులున్నారు.

ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించాలి



ధూళిమిట్టలో ధాన్యం తూకాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మధుసూదన్

ధూళిమిట్ట,మే18(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం తహసీల్దార్ మధుసూదన్ పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో గల జాప్యానికి కారణాలు అడిగి తెలుసుకొని పరిష్కరించారు. హమాలీలతో మాట్లాడి వడ్ల కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యాన్ని దగ్గరుండి తూకం వేయించి మూడు లారీలలో మిల్లులకు పంపించారు.ఆదివారం సెలవు రోజైనా ధాన్యాన్ని దగ్గరుండి మిల్లులకు తరలించిన తహసీల్దార్‌ను పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో పలువురు రెవిన్యూ సిబ్బంది,కేంద్రం నిర్వాహకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

రాయపోల్, మే 18 (ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికుల సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ బీడీ వర్కర్స్ ఫెడరేషన్ కోశాధికారి ముఖ్రం, రాష్ట్ర సహాయ కార్యదర్శి అయ్యావారి లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆది రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం రాయపోల్‌లో జరిగిన బీడీ కార్మిక సంఘం జనరల్ బాడీ సమావేశంలో వారు పాల్గొని బీడీ కార్మికుల సమస్యలను చర్చించారు. బీడీ కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలకు అడ్డుకోవాలని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేయూత పేరుతో బీడీ కార్మికులకు నెలకు రూ. 4,016లు ఇవ్వడంతో పాటు పెరిగిన కూలి రేట్లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే బీడీ పరిశ్రమపైన వేస్తున్న జీఎస్టీని ఎత్తివేయాలన్నారు. 50 ఏళ్ల వయసు తర్వాత రాజీనామా చేసినవారికి కనీస పెన్షన్ రూ. 6వేలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో బీడీ కార్మికులు స్వప్న, పుష్ప, అనసూయ, సుమలత, బాలమణి, భార్గవి, భవాని తదితరులు పాల్గొన్నారు.

ఎంఈపీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దుండిగల్ యాదగిరి

వర్గల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : ముదిరాజ్ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దుండిగల్ యాదగిరి ముదిరాజ్ నియామకమయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఎంఈపీఏ రాష్ట్రస్థాయి సమావేశంలో సిద్దిపేట జిల్లా వర్గల్‌కు చెందిన దుండిగల్ యాదగిరిని ఎంఈపీఏ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ ఏకగ్రీవంగా నియామకం చేసినట్లు దుండిగల్ యాదగిరి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌ల అభివృద్ధి, ఐక్యత కోసం కృషి చేస్తానని, ఎంఈపీఏ బలోపేతం కోసం పని చేస్తానన్నారు. తనను ఉపాధ్యక్షుడిగా నియామకం చేసిన రాష్ట్ర అధ్యక్షులకు, కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

గాగిల్లాపూర్‌లో హనుమత్ యజ్ఞం





గాగిల్లాపూర్ హనుమాన్ ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం, సిద్దిపేట నుంచి కొండగట్టుకు పాదయాత్రగా వెళ్తున్న హనుమాన్ స్వాములు

బెజ్జంకి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాగిల్లాపూర్ హనుమాన్ ఆలయంలో ఆదివారం హనుమాన్ దీక్షాపరులు హనుమత్ యజ్ఞాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆంజనేయ స్వామి విగ్రహానికి చందనాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించి, పూజలు చేశారు.

కొండగట్టుకు స్వాముల పాదయాత్ర

సిద్దిపేట కల్చరల్/చిన్నకోడూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భజనలు, భక్తి పాటలు, మంగళ హారతులతో హనుమాన్ స్వాముల పాదయాత్ర ఆదివారం ప్రారంభమైంది. సిద్దిపేటలోని శ్రీ ఉమాపార్థివ కోటిలింగేశ్వరాలయం నుంచి కొండగట్టుకు వివిధ ప్రాంతాల నుంచి 100 మంది హనుమాన్ స్వాములు ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. సంగం మధుసూదన్ రెడ్డిస్వామి నేతృత్వంలో ప్రారంభమైన పాదయాత్రకు మహిళలు మంగళహారతులిచ్చారు. పాదయాత్రలో పాల్గొనే హనుమాన్ స్వాములకు ఆహారం, పండ్లు, నీటి వసతి తదితర సౌకర్యాలను మధుసూదన్‌రెడ్డి మిత్రుల సౌజన్యంతో సమకూర్చారు. బుధవారం రాత్రి స్వాముల పాదయాత్ర కొండగట్టును చేరుకుంటుంది. అదేవిధంగా చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ గ్రామానికి చెందిన సుమారు 50 మంది హనుమాన్ స్వాములు ఆదివారం కొండగట్టుకు పాదయాత్రగా వెళ్లారు. దాదాపు 3 రోజుల్లో చేరుకుంటామని తెలిపారు.